ఈనాడు
epaper.eenadu.net


# 5 ప్రాజెక్టులకు ఆయువు పోయండి

## మెట్రో, ఆర్ఆర్ఆర్, డ్రైపోర్టు, మూసీకి నిధులివ్వండి • సెమీ కండక్టర్ తయారీ యూనిట్ కావాలి

- కొత్తగా మరో 29 ఐపీఎస్ పోస్టులు అవసరం
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- మూసీ పునరుజ్జీవం మంచి ఆలోచన అని ప్రధాని అభిప్రాయపడినట్లు వెల్లడి

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు పంచప్రాణాలతో సమానమైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. సీఎం బుధవారం దిల్లీలో ప్రధానిని ఆయన అధికార నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. సుమారు గంటసేపు ఆయా అంశాలపై ప్రధానితో చర్చించారు. వాటిలో 1. హైదరాబాద్ మెట్రో రెండో దశ 2. రీజినల్ రింగురోడ్డు దక్షిణభాగం 3. రీజినల్ రింగ్ రైల్వే, హైదరాబాద్ డ్రైపోర్టు నుంచి బందర్‌పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వే కనెక్టివిటీ 4. సబర్మతి, గంగా, యమున తరహాలో మూసీ పునరుద్ధరణ 5. తెలంగాణకు సెమీ కండక్టర్ యూనిట్ కేటాయింపు అంశాలున్నాయి. రాష్ట్రానికి మరో 29 మంది ఐపీఎస్‌లను కేటాయించాలని కూడా కోరారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి శేషాద్రి తదితరులు కూడా వెళ్లినా.. అంతర్గతంగా సీఎం, ప్రధానిల మధ్య మాత్రమే ముఖాముఖి చర్చ జరిగింది.

...మిగతా 2లో



ప్రధాని మోదీతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## పీఎంఏవై సర్వే పూర్తి చేయించండి

- 2016-18 మధ్య 70 వేల ఇళ్లు ఇచ్చినా.. అమలు చేయలేదు
- సీఎం రేవంత్‌రెడ్డికి పెండింగ్ పనుల చిట్టా ఇచ్చిన ప్రధాని
- అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న వివిధ కేంద్ర ప్రాజెక్టులకు సంబంధించిన జాబితాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం తనను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించగా.. సీఎం సానుకూలంగా స్పందించారు. ఇవన్నీ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న అంశాలేనని. ...మిగతా 2లో

Date : 27/02/2025 EditionName : GREATER HYDERABAD PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# 5 ప్రాజెక్టులకు ఆయువు పోయండి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కోరిన అంశాలన్నింటినీ కచ్చితంగా పరిశీలిస్తామని, అభివృద్ధికి సహకరిస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తర్వాత వెల్లడించారు. 'నదులన్నింటినీ ప్రక్షాళన చేస్తే బాగుంటుంది. మూసీని పునరుజ్జీవింపజేయాలన్నది మంచి ఆలోచన. దీనికి మీరు అడిగిన నిధుల అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తాం' అని ప్రధాని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఇదే సమయంలో.. 'మీరు రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులపై నాకు దరఖాస్తు ఇచ్చారు, తెలంగాణ వద్ద పెండింగ్‌లో ఉన్న కేంద్ర పథకాలకు సంబంధించిన దరఖాస్తును మీకు ఇస్తున్నా, వాటిని పరిష్కరించేలా చూడండి' అంటూ ప్రధానమంత్రి తనకు ఆరు పెండింగ్ అంశాల జాబితాను అందించినట్లు సీఎం వెల్లడించారు.



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. పక్కన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## ముఖ్యమంత్రి.. ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ముఖ్యాంశాలివీ...

- "మెట్రోరైల్ నెట్‌వర్క్‌లో ఒకప్పుడు దిల్లీ తర్వాతి స్థానంలో ఉన్న తెలంగాణ.. ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయింది. గత ప్రభుత్వం మెట్రో విస్తరణే చేపట్టలేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగినందున మెట్రో రెండో దశను చేపట్టాల్సి ఉంది. 76.4 కి.మీ. పొడవున 5 కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు అవుతుందని అంచనా. ఇందులో కేంద్రం వాటా 18%, రాష్ట్రం వాటా 30%, రుణ భాగం 48% ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను 2024 నవంబరు 4న కేంద్ర పట్టణాభివృద్ధిశాఖకు సమర్పించింది. దీనికి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి కేంద్ర మంత్రివర్గ ఆమోదం తెలపాలి.
- రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు అనుమతులు, కేంద్ర మంత్రివర్గ ఆమోదం తెలపాలి. ఉత్తరభాగం పూర్తయిన తర్వాత దక్షిణభాగం చేపడితే నిర్మాణ, భూసేకరణ వ్యయం భారీగా పెరిగిపోతుంది. అందువల్ల రెండింటినీ ఏకకాలంలో అభివృద్ధి చేయాలి. దక్షిణ భాగం భూసేకరణ ఖర్చులో 50% పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధం. ఈ రహదారిని పూర్తి చేయడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి. రీజినల్ రింగ్‌రోడ్డు వెంబడి 370 కి.మీ. మేర రైల్వేలైన్ వలయాన్ని నిర్మిస్తే.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ రవాణా సదుపాయాలు విస్తరిస్తాయి.
- తెలంగాణలో ఒక డ్రైపోర్టు నిర్మించి దాన్ని ఏపీలోని బందరుపోర్టుతో అనుసంధానం చేస్తూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేలైన్ నిర్మించాలి. దీనివల్ల సరకు రవాణా ఖర్చు తగ్గుతుంది. పారిశ్రామిక విస్తరణ, ఎగుమతులు పెరుగుతాయి. కొత్త ఉద్యోగాలు కల్పించవచ్చు.
- హైదరాబాద్‌లో 55 కి.మీ. పొడవున మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలని తలపెట్టాం. గోదావరి నుంచి మూసీలోకి స్వచ్ఛమైన జలాలను తీసుకురావాలని నిర్ణయించాం. మూసీ ప్రక్షాళన కోసం 27 శుద్ధిప్లాంట్లు నిర్మించాలని భావిస్తున్నాం. వరద రక్షణ గోడల నిర్మాణం, కరకట్టలను బలోపేతం చేయడం, గాంధీ సరోవర్ ప్రాజెక్టు వంటివి ఇందులో అంతర్భాగం. మూసీ-గోదావరి అనుసంధానం కోసం రూ.2 వేల కోట్లు ఇవ్వాలి. నదికి ఇరువైపులా మౌలిక వసతులు, హెరిటేజ్ బ్రిడ్జిల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు, గాంధీ సరోవర్, విహార ప్రదేశాల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు, తూర్పు-పడమరల్లో ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.10 వేల కోట్లు కలిపి మొత్తం రూ.20 వేల కోట్ల సాయం చేయాలి. రక్షణ శాఖకు చెందిన 222.7 ఎకరాల భూమిని బదిలీ చేయాలి.
- అస్సాం, గుజరాత్‌లకు ఐదు సెమీ కండక్టర్ తయారీ యూనిట్లను మంజూరు చేసినట్లుగానే తెలంగాణకు ఒక యూనిట్‌ను కేటాయించాలి. ఇందుకు అవసరమైన సాంకేతిక, మౌలిక వసతుల అర్హతలన్నీ తెలంగాణకు ఉన్నాయి" అని ప్రధానమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

Date : 27/02/2025 EditionName : GREATER HYDERABAD PageNo :